క్లుప్తంగా

భీమా ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవ వేడుకల్లో విద్యార్థినులు, అధ్యాపకులు

ఆదోని రూరల్: ఆదోని–ఆలూరు రహదారిలోని భీమా ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినులు ఆట, పాటలతో ఎంతో ఆనందంగా గడిపారు. ముఖ్య అతిథిగా సివిల్ డిపార్ట్‌మెంట్ నందినిరెడ్డి, భార్గవి, పద్మావతి, అనిత, రీతూ, ప్రియాంక, కళాశాల సెక్రటరీ పి.ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.ఎస్.సురేంద్రబాబు, డాక్టర్ ఆల్బర్ట్ పాల్గొని మాట్లాడారు.

బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పెద్దకడబూరు : మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో గత శనివారం గడ్డివామి కాలిపోయిన విషయం విధితమే. బాధితుడు ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్ (వైఎస్సార్ సీపీ)కు మంగళవారం ఆర్థిక సహాయం అందిజేశారు. రూ. 10వేలు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారం అందించగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి రూ. 5వేలు, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ రూ. 5వేలు చొప్పున అందజేశారు. కార్యకర్తలకు, నాయకులు ఎమ్మెల్యే కుటుంబం ఆధ్వర్యంలో ఎప్పుడూ తోడుగా ఉంటామని భరోసా ఇచ్చాడు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శివరామ్‌రెడ్డి, బ్రహ్మయ్య, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ప్రశ్నపత్రాలు



ప్రశ్న పత్రాలను విభజిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్న పత్రాలు మంగళవారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి పర్యవేక్షణలో పరీక్ష ఎగ్జామినర్లు ప్రశ్న పత్రాల బండిళ్లను పరిశీలించారు. వచ్చిన వాటిని ఏఏ సెంటర్లకు ఎన్నెన్ని ప్రశ్న పత్రాలు వెళతాయో వాటి ప్రకారం సర్ది పోలీసు స్టేషన్లో భద్రపరిచారు.

సుదర్శన్ కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్, పూలే అంబేడ్కర్ సొసైటీ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన సుదర్శన్ ఏడాది క్రితం అనారోగ్యంతో కోమాలో వెళ్లిపోవడంతో ఆయన కుటుంబానికి మంగళవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు, పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు చేయూతనందించారు. జ్వరంతో కోలుకోలేక ఖరీదైన వైద్యం చేయించినా లాభం లేక దాదాపు 16 నెలలుగా కోమాలో వున్నట్లు ఆయా సంఘ నాయకులు గిడ్డయ్య, ప్రతాప్, నరసన్న తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన కుటుంబ సభ్యులకు ఎంఆర్‌పీఎస్ తరఫున రూ.10వేలు, సొసైటీ సభ్యులు నెలకు సరిపడ నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లాక్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రవీణ్‌కుమార్, రాజు, చక్రవర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థి వీరనాగప్ప

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అదే పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థి వీరనాగప్ప పరీక్ష సామగ్రి అందజేశారు. మంగళవారం స్థానిక పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అరుణ సమక్షంలో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 79 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.106 విలువ చేసే ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు తదితర వస్తువులు అందించారు. పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు.

పన్నులు వసూలయ్యేనా..?

- రూ.3.77 కోట్లకు పైగా ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు
- ఇవి వసూలైతే పట్టణ అభివృద్ధికి మరింత ఊతం
- నోటీసులతో సరిపుచ్చుకుంటున్న మున్సిపల్ అధికారులు
- సామాన్యులకు, ప్రభుత్వానికి ఒక్కటే విధానం ఉన్నా చర్యలు తీసుకోనివైనం



రూ.42.77లక్షలకు పైగా బకాయి పడ్డ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం



రూ.35లక్షల పన్ను బకాయిపడ్డ పోస్టాఫీస్



రూ.35.63లక్షల బకాయి ఉన్న తహసీల్దార్ కార్యాలయం

ఎమ్మిగనూరు టౌన్: పన్నుల వసూళ్లలో కఠినంగా వ్యవహరించాలని స్థానిక సంస్థలకు సూచిస్తున్న ప్రభుత్వం తమ పరిధిలోని బకాయిల విషయంలో మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సామాన్యుల నుంచి ముక్కుపిండి మరీ ఆస్తి పన్నులు వసూళ్లు చేసే మున్సిపల్ అధికారులు పలు ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు 15 ఏళ్లకు పైగా రూ.కోట్లలో బకాయిలున్నా వాటి వసూళ్లలో మాత్రం నోటీసులతోనే సరిపుచ్చుకుంటున్నారు. దీంతో బకాయిలు ఏటా పెరిగిపోతున్నాయి. ఆయా పన్నులు వసూలైతే పట్టణం మరింత అభివృద్ధి సాధించే అవకాశం వుంది.

నోటీసులకు స్పందన కరువు

పట్టణ పరిధిలో ఇప్పటి వరకు పలు ప్రభుత్వ శాఖల నుంచి మున్సిపాలిటీకి గత నెలాఖరుకు గాను రూ.3.77కోట్లకు పైగా బకాయిలు వసూలు కావాల్సివుంది. పన్నుల వసూళ్ల కోసం సంబంధిత ప్రభుత్వ శాఖలకు డిమాండ్ నోటీసులను మున్సిపల్ అధికారులు ఏటా పంపుతున్నా ఆయా శాఖల నుంచి మాత్రం స్పందన కరువవుతోంది. ఇక మున్సిపల్ అధికారులు కూడా నోటీసులు ఇచ్చేందుకే పరిమితమవుతున్నారు. సామాన్యులు పన్నుల చెల్లింపులో జాప్యం చేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఏకంగా రెడ్ నోటీసులు, జప్తు నోటీసులు ఇచ్చే అధికారులు ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన బకాయిల వసూళ్లలో మాత్రం వెనుకడుగు వేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అయితే మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 91 ప్రకారం పన్నులు చెల్లించకపోతే సామాన్యులతో పాటు ప్రభుత్వ శాఖల ఆస్తులు జప్తు చేసేందుకు ఒకటే విధానం ఉన్నా దాన్ని అమలు చేసేందుకు మాత్రం మున్సిపల్ శాఖ సాహసం చేయలేకపోతుంది.

నెలాఖరులోగా పూర్తి స్థాయిలో ఆస్తి పన్ను వసూలుకు చర్యలు

పట్టణంలో ప్రైవేట్ ఆస్తులు, ఇళ్లు తదితర వాటికి సంబంధించిన ఆస్తి పన్ను వసూలుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో 24,009 అసెస్‌మెంట్లు ఉండగా వాటికి సంబంధించిన ఆస్తి పన్ను రూ.5.06కోట్లు వసూలు కావాల్సి వుండగా ఇప్పటి వరకు రూ.3.18 కోట్లు వసూలయ్యాయి. గుర్తించిన 1,261 ఖాళీ స్థలాలకు సంబంధించి జరిమానాలతో కలిపి రూ.76.41లక్షలు వసూలు కావాల్సి వుండగా కోర్టు కేసులతో పెండింగ్‌లో వుండి బకాయిలు రూ.31.14లక్షలు మున్సిపాలిటీకి రావాల్సి వుంది.

బకాయిల వసూళ్లకు నోటీసులిచ్చాం



ప్రభుత్వ శాఖల బకాయిల వసూళ్ల కోసం ఆయా శాఖల వారికి ఇప్పటికే రెండు మూడు మార్లు నోటీసులిచ్చాం. బకాయిల విషయం ప్రభుత్వ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగింది. ప్రతి ఆరు నెలలకు ఒక సారి బకాయిలపై పెనాల్టీలతో నోటీసులు జారీ చేస్తూ ఆ మేరకు చర్యలు తీసుకోనున్నాం. ఆయా బకాయిలు వసూలైతే పట్టణ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. అదేవిధంగా ఈనెలాఖరులోగా పట్టణ వాసులు చెల్లించాల్సిన ఆస్తి పన్నులు చెల్లిస్తే పట్టణాభివృద్ధికి సహకరించిన వారవుతారు. అదేవిధంగా బకాయిలపై జరిమానాల భారం కూడా తప్పుతుంది. అలాగే పట్టణంలో మున్సిపల్ శాఖ అనుమతుల్లేకుండా నిర్మించిన కట్టడాలు, అదనపు నిర్మాణాలకు సంబంధించి కోర్టు ద్వారా రూ.1.95లక్షలు వసూలుచేశాం.

–గంగిరెడ్డి ,మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాల పన్నుల బకాయిలు

కార్యాలయం	పన్ను బకాయి
తహసీల్దార్ కార్యాలయం	రూ.35,63,592
పటణంలోని పోలీస్ శాఖ	రూ.15,85,856
సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం	రూ.4,05,027
జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన సముదాయం	రూ.77,976
ఎక్సైజ్ ప్రొబిషన్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం	రూ.23,998
పంచాయితీరాజ్ శాఖ డీఈఈ శాఖ	రూ. 6,86,366
ఎంపీడీఓ కార్యాలయం	రూ9,95,073
ఆర్‌అండ్‌బి శాఖ డీఈఈ కార్యాలయం	రూ.33,33,043
పోస్ట్ ఆఫీస్	రూ.35,01,836
ఏపీ హౌసింగ్ కార్యాలయం	రూ.1,82,823
ఎక్సేంజి ఆఫీస్	రూ.2,63,342
ఐసీడీఎస్	రూ.22,187
పీఆర్ డీఈఈ ఎస్‌ఏపీ	రూ.2,19,372
ఎక్జిక్యూటీవ్ డైరెక్టర్ ఎస్.సి	రూ.18,83,960
టీజీపీ డీఈఈ కార్యాలయం	రూ.11,40,498
జూనియర్ ఇంజనీర్ టెలిఫోన్ ఎక్సేంజి కార్యాలయం	రూ.39,736
డిప్యూటీ ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్	రూ.42,77,013
పీడీ డీఫామ్ కార్యాలయం	రూ.22,90,536

వాతావరణానికి అనుగుణంగా పంటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న నాబార్డ్ ఏజీఎం సుబ్బారెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగుచేసుకోవాలని కర్నూలు ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ, నాబార్డ్ ఏజీఎం సుబ్బారెడ్డి, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి అధ్యక్షతన జాతీయ వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి బ్యాంక్(నాబార్డ్), కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ అనుబంధ రంగాలపై వాతావరణ మార్పు అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే వాతావరణ మార్పుల వలన వచ్చే నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులతో అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. సమావేశంలో కేవీకే శాస్త్రవేత్తలు చందన, నిరంజన్‌రెడ్డి, మౌనిక, నవయూత్ అసోసియేషన్ సీఈఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి



నందవరంలో స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

నందవరం: వెలుగు అధికారులు, సిబ్బంది పొదుపు మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ వైపీ రమణారెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని నూతన వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. వెలుగు అధికారులు, సిబ్బందితో డీఆర్‌డీఏ పీడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించిన వెలుగు కార్యాలయంలో విద్యుత్, వాటర్ సప్లై, కొద్ది పాటి మరమ్మతులు ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పీఆర్ఏఈ నరసింహులును ఆదేశించారు. అలాగే నందవరం మండలంలో బాల్య వివాహాల నిర్మూలన, లింగవివక్ష, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు జెండర్ రీసోర్స్ సెంటర్ ఏర్పాటుకు ఎంపికైందని చెప్పారు. ఈ సెంటర్ లింగవివక్షకు, బాల్య వివాహాలు, లైంగికదాడులకు గురైన మహిళలకు రక్షణ కల్పించి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాఘవేంద్ర, వెలుగు సీసీలు ముక్కన్న, మల్లేష్, భీమేష్, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదులో జాప్యం ఎందుకు?



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య

పెద్దకడబూరు : దళిత మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడి ఐదు రోజులయినా కేసు నమోదు చేయడంలో పోలీసులు ఎందుకు జాప్యం చేస్తున్నారని జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య ప్రశ్నించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేయాలంటూ శాంతియుత నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న మండల పరిధిలోని మేకడోణ గ్రామంలో పొలం పనికి వెళ్లిన ఒక దళిత మహిళపై అదే గ్రామానికి చెందిన మైనార్టీ కులానికి చెందినవారు అత్యాచారయత్నానికి పాల్పడితే బాధితురాలు అదేరోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. అయితే ఇప్పటి వరకు పోలీసులు ఎఫ్ఐఆర్ కట్టకపోవడం దారుణమని ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసేంతవరకు నిరసన కార్యక్రమం విరమించేదే లేదన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నందవరంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నందవరం : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు సర్కిల్ డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీ వాసులతో సైబర్ నేరాలు, మహిళల రక్షణ, రోడ్డు నింబంధనలు, బాల్య వివాహాల నిర్మూలన, మత్తు పదర్థాలకు బానిసలు కావొద్దనే అంశాలపై ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..మహిళలు, బాలికలపై అఘాయిత్యాలును అరికట్టి వారికి రక్షణ కల్పించడం అందరి బాధ్యత అన్నారు. మార్చి నుంచి వాహనదారులకు కొత్త చట్టాలు అమలు అయ్యాయని, వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఎమ్మిగనూరుటౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా వుండాలని స్థానిక పట్టణ ఏఎస్ఐ కిష్టప్ప, రావూస్ కళాశాల సీఈఓ తిరుమల్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు 80శాతం మొబైల్ ఫోన్‌ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా తీసుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అందువలన అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ షకీరా పర్వీన్, కళాశాల ప్రిన్సిపాల్ ఇర్ఫాన్, ప్రోగ్రాం ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థల సమస్యను పరిష్కరించండి

కౌతాళం: శ్మశాన వాటిక స్థల సమస్యకు పరిష్కారం చూపాలని కురవ, గొల్ల, వీరశైవ లింగయాత సామాజిక వర్గాలకు చెందిన వారు తహసీల్దారు రజినీకాంత్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. మండల పరిధిలోని కామవరం గ్రామంలో ఆయా వర్గాల వారు 2008లో శ్మశాన వాటిక కోసం స్థలాన్ని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఇక్కడ ఎన్నో మృతదేహాలను పూడ్చారు. అయితే ఇప్పుడు ఈ స్థలం తనదని ఈరన్న అనే వ్యక్తి తమకు అడ్డుంకులు కల్పిస్తున్నాడని వారు తహసీల్దారుకు వివరించారు. ఈ స్థల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

మైనర్ బాలిక చైల్డ్ హోమ్‌కు తరలింపు

గోనెగండ్ల : మండల పరిధిలోని బి. అగ్రహారం గ్రామానికి చెందిన మైనర్ బాలికను అధికారులు మంగళవారం కర్నూలు చైల్డ్ హోమ్‌కు తరలించారు. బి.అగ్రహారం గ్రామానికి చెందిన 13 ఏళ్ల మైనర్ బాలికకు ఈనెల 9వ తేదీన కంపాడు గ్రామానికి చెందిన ఓ యువకుడికి ఇచ్చి వివాహం జరిపించినట్లు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు పోలీసులతో కలిసి మంగళవారం మైనర్ బాలిక ఇంటి వద్దకు వెళ్లి విచారించారు. అనంతరం మైనర్ బాలికను కర్నూలులోని చైల్డ్ హోమ్‌కు తరలించినట్లు తెలిసింది. అలాగే ఆ గ్రామానికి చెందిన మరో మైనర్ బాలిక వివాహాన్ని అడ్డుకున్నట్లు సమాచారం.

సమస్యలు పరిష్కరించండి

ఆదోని రూరల్: పట్టణంలోని 20వ వార్డులో గంగారాం ఆసుపత్రి వెనక డ్రైనేజీ కాలువలను శుభ్రపరచాలని, వీధుల్లో విద్యుత్ సర్వీస్ వైర్లను పైకి కట్టాలని సీపీఎం కార్యవర్గ సభ్యులు తిప్పన్న డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా చైతన్యయాత్రలో భాగంగా సీపీఎం నాయకులు కాలనీల్లో పర్యటించారు. కాలనీవాసులు పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు వీరేష్, వెంకటేష్, తిక్కప్ప, సూరి తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు సహకరించాలి

ఆదోని సెంట్రల్: టీబీ వ్యాధిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మెడికల్ అధికారి పృథ్వీరాజ్, ఎంపీహెచ్ఎస్ బాబురాజు పిలుపునిచ్చారు. మంగళవారం కల్లుబావిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం రుక్సాన బేగం అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నప్పుడు, ఒకవేళ దగ్గులో రక్తపుచారలు, ఆకలి మందగించడం, బరువుతగ్గడం ఉదయ, సాయంత్రం వేళల్లో జ్వరం వస్తు ఉంటే తప్పకుండా గళ్ల పరీక్ష చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి, టీబీ సిబ్బంది సుబ్బమ్మ బాయ్, ఏఎన్ఎం అనసూయ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

ఎమ్మిగనూరుటౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ఆ పరిశ్రమకు సొంతంగా గనులను కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరుతూ ఈనెల 14వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట, నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆందోళనకు అన్ని పార్టీలు, కార్మికులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వీరేష్, తిమ్మగురుడు, నరసింహారెడ్డి, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని గుడేకల్ రోడ్డు టీబీఎస్ షోరూం వెనుక రామలింగేశ్వర మెడికల్ ఏజెన్సీ పైన ఉన్న ఇంట్లో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో రాత్రి దొంగలు మెడికల్ ఏజెన్సీ సీసీ కెమెరాలను కట్ చేసి పైకి వెళ్లి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లారు. అయితే ఇంట్లో చిల్లర తప్ప ఏమి దొరకకపోవటంతో పారిపోయినట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం మెడికల్ ఏజెన్సీ వారు వచ్చిచూడగా సీసీ కెమరాల వైరును కట్ చేసి ఉండటం గమనించి పైకి వెళ్లి చూడగా తాళలు తీసి ఉండటంతో ఊరికెళ్లిన ఇంట్లో వాళ్లకు సమాచారం అందించారు. అలాగే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. చోరీకి యత్నించినట్లు సమాచారం వచ్చిందని విచారిస్తున్నామని, కేసు నమోదు చేయలేదని పట్టణ పోలీసులు తెలిపారు.

గడ్డి వాముల దగ్ధం

కౌతాళం: మండల పరిధిలోని బాపురం గ్రామంలో మూడు గడ్డివాములు దగ్ధమైన ఘటనలో రూ.3లక్షల ఆస్తినష్టం జరిగింది. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామానికి చెందిన హరిజన కోలికి ఈరప్ప, బజారి, కాలే మారెప్పలకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపుచేసింది.రెండు నెలల క్రితమే గడ్డిని కొనుగోలు చేసుకుని ఉంచుకున్నామని, పశువులకు మేత లేకుండా పోయిందని బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతున్నారు.

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా ఎన్నికల ముందు యువతకు, విద్యార్థులకు, ప్రజలకు ఇచ్చిన హమీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కెఆర్.లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీసెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు డి.నజీర్‌అహమ్మద్, నందవరం మండల పార్టీ కన్వీనర్ శివప్పగౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువత పోరు పోస్టర్లను పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నియోజకవర్గ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కేఆర్ రామకోటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని, నిరుద్యోగ భృతి, విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్‌లాంటి హామీలన్నీ అమలు చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు కాలయాపన చేస్తూ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. యువత పోరు కార్యక్రమానికి యువతతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి ఐక్యతతో కృషి

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి ఐక్యతతో కృషి చేస్తామని కొత్తగా నియామకమైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి జి.విరూపాక్షిరెడ్డి అన్నారు. వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కమిటీకి ఎన్నికైన వారికి నందవరం మండలంతో పాటు స్థానిక పార్టీ నాయకులు మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సత్కరించారు.

'యువత పోరు'కు తరలిరండి



పెద్దకడబూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పెద్దకడబూరు : కర్నూలులో బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే యువత పోరు కార్యక్రానికి విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నాయకులతో కలసి యువత పోరు పోస్టర్లును విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేవలం అధికారం కోసమే కూటమి ప్రభుత్వం యువతను మభ్యపెట్టిందన్నారు. నేడు కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ఆందోళన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు దయ్యాల మహబూబ్, నాయకులు శివరామ్‌రెడ్డి, ముక్కరన్న, బ్రహ్మయ్య, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్లను పునరుద్ధరించండి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను పునరుద్ధరించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, ఖాజా కోరారు. మంగళవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నాడు–నేడు పనులలో భాగం పేద విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని రూ. లక్షలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందన్నారు. అయితే ప్రస్తుతం మరమ్మతులకు వచ్చి ఉపయోగపడడం లేదన్నారు. అధికారులు స్పందించి ప్రజాధనం వృథా చేయకుండా ప్లాంట్‌లకు మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు తాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నాగరాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతులు



బోరింగు మరమ్మతు చేస్తున్న దృశ్యం

కౌతాళం: వేసవి కాలంను దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నివారించేందుకు మండల కేంద్రంలో చెడి పోయిన బోరింగులకు (చేతిపంపులకు) మరమ్మతులు చేపట్టినట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. మంగళవారం గ్రామంలోని శివప్పనగర్, హనుమన్‌నగర్, రాజనగర్ పాఠశాలలో వృధాగా ఉన్న బోరింగులకు మరమ్మతులు చేయించారు. గ్రామంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సహకారంతో మరమ్మతులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజలు పంచాయతీకి సకాలంలో ఇంటి, కుళాయి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పైపులైన్ లీకేజీ

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం మండిగిరి గ్రామ పంచాయితీ పరిధిలోని రాయచోటి సుబ్బయ్య కాలనీ శాంతి ఎస్టేట్‌లో పైపులైన్ లీకేజీ ఏర్పడి నీరు నిల్వ ఉంటోంది. దీంతో సగం రహదారిపై గుంత ఏర్పడింది. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు సాగించడానికి ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా నీరు కలుషితమై వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి రహదారిని బాగు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



పైపులైన్ లీకేజీతో నిల్వ ఉన్న నీరు

బాధితులకు ఆర్థిక సాయం అందేలా చర్యలు

ఆదోని టౌన్: కర్ణాటకకు చెందిన గంగావతి ఆర్టీసీ బస్సు (కేఏ37ఎఫ్ 0711) పెద్దతుంబళం గ్రామ సమీపంలో మంగళవారం రెండు మోటార్ సైకిళ్లను ఢీకొన్న ఘటనలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఆదోని డిపో మేనేజర్ మహమ్మద్ రఫీక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంఘటన జరిగిన వెంటనే ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్, కడప ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ప్రభుత్వంతో, పోలీసు అధికారులతో, కర్ణాటక ఆర్టీసీ అధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. వారు బాధిత కుటుంబ సభ్యులకు తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారని చెప్పారు.